పాలకవర్గం పదిలమేనా....! రద్దు చేసేందుకు పావులు కదుపుతున్న వైనం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : స్థానిక మున్సిపాలిటీలో గత కొన్ని నెలలుగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించని కారణంగా అసలు ఈ మున్సిపాలిటీలో పాలకవర్గం ఉందా? లేదా? అన్న సందిగ్ధం ప్రజల్లో నెలకొంది. పాలకవర్గం ఉంటే ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కారం చేసే దిశగా అడుగులు వేయాలని అదేది స్థానిక మున్సిపాలిటీలో కనబడటం లేదని స్థానికులు ఆశ్చర్యాన్ని వ్యక్త పరుస్తున్నారు.గడచిన డిసెంబర్ వరకు పాలకవర్గ సమావేశాలు సక్రమంగా జరిగాయని జనవరి నెల నుంచి ఈ సమావేశాలను ఎందుకు నిర్వహించడం లేదన్న అనుమానాన్ని స్థానికులు వ్యక్త పరుస్తున్నారు. జనవరి 29వ తేదీన ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఎటువంటి పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదని వాస్తవానికి ఎన్నికల నియమావలిలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్ట కూడదు కానీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించ కూడదన్న నిబంధనలు లేవని ఎన్నికల కోడ్ నిబంధనతో సమావేశాలను నిర్వ హించేందుకు మున్సిపల్ అధికారులు కాల యాపన చేశారని రాజకీయ విశ్లేషకులు వాదిస్తున్నారు.ఇది ఇలా ఉండగా ఎన్నికల కోడ్ అనంతరం ప్రజా పరిపాలన, పట్టణ అభివృద్ధిని పక్కనపెట్టి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం తెరలేపింది.దీని కారణంగా పాలకవర్గ సభ్యులు ఎవరికి అను కూలంగా వారు పార్టీ

కండువాలు మారుస్తూ పాలకవర్గంలో పటిష్టతను కోల్పోయారన్న వాదనలు వినిపిస్తున్నాయి.ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం 16 మంది పాలకవర్గ సభ్యులతో బలాన్ని సరి పెట్టుకోవడంతో చైర్ పర్సన్ పై పెట్టిన అవిశ్వాసం నెగ్గని పరిస్థితి నెలకొంది. దాదాపు ఐదు నెలలుగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించక పోవడంతో "ఎలక గుడ్డిదైతే పిల్లి గెంతులేసింది" అన్న చందంగా మున్సిపల్ అధికారులు దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టినట్లు ఎవరి చేతివాటం వారు చూపిస్తూ నరన్న ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. పాలకవర్గం పట్టు కోల్పోవడంతో అక్రమ కట్టడాలు జోరందుకొని మున్సిపల్ అధికారి జేబును నింపు తున్నాయన్న సమాచారం చక్కెర్లు కొడుతోంది. విధి నిర్వహణలో భాగముగా పాలకవర్గ సమావేశాలు ఏర్పాటు చేసే బాధ్యత మున్సిపల్ కమిషనర్ పై ఉన్నప్పటికీ ఈ అధికారి సమావేశాలు ఏర్పాటు చేయకుండా కాలయాపన చేయటంలో ఆంతర్యం ఏమిటనేది పలువురికి అర్థం కాని ప్రశ్నగా మారుతుంది.మున్సిపల్ చైర్ పర్సన్ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయమని సంబంధిత కమిషనర్‌ను కోరినప్పటికీ నేటికీ సమావేశం ఏర్పాటు చేయలేదని,మున్సిపల్ కమీషనర్ కూటమి ప్రభుత్వానికి,శాసనసభ్యునికి కార్యకర్తలా వ్యవహరిస్తూ తన ఉద్యోగ బాధ్యతలను పక్కనపెట్టి పాలకవర్గాన్ని విస్మరిస్తున్నారని వైసీపీ పార్టీకి చెందిన పలువురు సభ్యులు బహిరంగంగానే వాదిస్తున్నారు. మున్సిపల్ చట్టంలోని నిబంధనల ప్రకారం వరుసగా మూడు నెలలు పాలకవర్గ సమావేశాలు నిర్వహించక పోతే ఆ పాలకవర్గమే రద్దయ్యే పరిస్థితి ఉంటుందని,అవిశ్వాసం పెట్టి అభాస పాలైన కూటమి ప్రభుత్వం పాలకవర్గాన్ని రద్దు చేసేందుకే మున్సిపల్ కమిషనర్ ను అడ్డం పెట్టుకొని సమావేశాలు నిర్వహించకుండా అడ్డుకుంటుందని, ఇదే జరిగితే జిల్లా కలెక్టర్‌కు, ఇతర ఉన్నతాధికారులకు మున్సిపల్ కమిషనరే సమాధానం చెప్పాల్సి ఉంటుందని వైకాపా పార్టీకి చెందిన కౌన్సిలర్లు హెచ్చరిస్తున్నారు.ఏది ఏమైనా గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక మున్సిపాలిటీలో వరుసగా ఐదు నెలలు సమావేశాలు నిర్వహించ కుండా ఉండటం ఇదే ప్రధమమని ఒకవేళ పాలకవర్గం రద్దయ్యే పరిస్థితి నెలకొంటే పాలకవర్గ సమావేశాలు నిర్వహించని కారణముగా ఇటీవల మున్సిపల్ చైర్ పర్సన్ ముందస్తుగా అనుమతించి సంతకాలు చేసిన అనుమతులు ఏవి చెల్లుబాటు అయ్యే పరిస్థితి లేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని విశ్లేషకుల సూచన.

మహిళ మృతిలో కొనసాగుతున్న దర్యాప్తు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని బల్లకృష్ణాపురంలో మహిళ బొత్స రవణమ్మ మృతిపై దర్యాప్తుముమ్మరంగా కొనసాగుతుంది. మహిళను హత్య కావించబడినదనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అన్నికోణాలు దర్యాప్తు చేస్తున్నారు. కేసును అనుమానస్పద కేసుగా నమోదుచేసిన, హత్యకోణంలోనే ఎక్కువగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తుంది. సీఐ గోవిందరావు, ఇన్చార్జి ఎస్ఐ నీలకంఠము, గరుగుబిల్లి, బలిజ పేట ఎస్ఐలు రమేష్ నాయుడు, సింహాచలంలతోపాటు వివిధ టీముల పోలీస్ బృందాలు అన్నికోణాల్లో దర్యాప్తును చేస్తున్నట్లు తెలుస్తుంది. పలువురుని స్టేషన్లకు రప్పించి విచారణ కూడా చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం. మరణించిన సమయంలో గ్రామంలో ఉన్నకుమార్తె చొంగలి లక్ష్మినుండి కూడా చాలావివరాలను ఆరా తీస్తున్నట్లు తెలిసింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసును వేగవంతంగా చేదించేందుకు నిరంతరం అన్ని కోణాల్లో దర్యాప్తు చేయడంలో పోలీస్ యంత్రాంగం నిమగ్నమైనది. హత్య కోణంలో పాటు దర్యాప్తుతో పాటు మృతి చెందిన సమయంలో ఇంట్లో నగదు బంగారం పోయిందన్న కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గోవిందరావు, ఎస్ఐలు తెలిపారు.

దినసరి కూలీలతో ఆటో బోల్తా

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : మండలం లోని పెదమరికి గ్రామం నుంచి కారాడ వలస వెళుతున్న ఆటో మార్గమధ్యంలో కృష్ణపల్లి గ్రామ శివారు మలుపు వద్ద అదుపుతప్పి పంట పొలాల్లో బోల్తా పడింది. ఎప్పట్లాగానే పెదమరికి గ్రామానికి చెందిన దినసరి కూలీల నిమిత్తం కారాడవలస మామిడి తోటలోకి పళ్ళు తెంపెందుకు వెళుతుండగా మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. అయితే ఎవరికి తీవ్ర స్థాయిలో ఎటువంటి గాయాలుకానప్పటికీ, కొందరికి మాత్రం చిన్న చిన్న దెబ్బలు తగిలినట్లు స్థానికులు చెబుతున్నారు. క్షతగాత్రులను 108 సహాయంతో పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. జరిగిన సంఘటనపై రూరల్ ఎస్ఐ సంతోషి విషయం తెలుసుకుని క్షతగాత్రులు చికిత్స పొందుతున్న జిల్లా ఆసుపత్రికి వెళ్లి వారితో మాట్లాడారు. జరిగిన ఆటో బోల్తా పై క్షతగాత్రులు ఎవరూ కూడా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో ప్రాథమిక చికిత్స మాత్రమే అందించి ఉంచారు. ఆటో బోల్తాపడడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

పక్కాగా ఆరోగ్య సర్వేలు నిర్వహించాలి : డాక్టర్ జగన్మోహన్

విశాలాంధ్ర - మక్కువ : ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతీ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి సర్వేను పక్కగా చేపట్టాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రో గ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు స్పష్టం చేశారు. మంగళవారంనాడు మండలంలోని మక్కువ, శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరుపై,ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి ప్రగతి నివేదికలను పరిశీలించారు. కొత్తగా నివేదించిన ఆశా సర్వే రికార్డ్స్‌పై ఏమేరకు పరిజ్ఞానం ఉందో గమనించారు. ప్రతీ గ్రామానికి సంబంధించి ఇంటింటి సర్వే,గర్భిణీ నమోదు,కాన్పు వివరాలు, కుటుంబ నియంత్రణ, సంక్రమిత/అసంక్రమిత వ్యాధులు నమోదు చేయాలన్నారు. బాల్యంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల క్రమంలో ఆరోగ్య సమస్యలు, లోపాలు ముందుగానే గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో జ్వరాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదని ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలన్నారు.దోమల నివారణకు ప్రస్తుతం కొనసాగుతున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే సత్వరమే తెలిజేయడంలో ఆశ కార్యకర్తలు క్రియాశీలకంగా ఉండాలన్నారు. ఓఆర్ఎస్,మందులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు.సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలు మెరుగైన వైద్య సేవలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా జి. హరికృష్ణ,డా ఎంవి.కిరణ్ కుమార్, ఎపిడెమిక్ ఈఓ సత్తిబాబు, సూపర్వైజర్స్ నిర్మల, రాజశేఖర్, విజయలక్ష్మీ, రత్నం, సరస్వతి వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

9వ రోజుకు చేరిన సీహెచ్‌ఓల సమ్మె

విశాలాంధ్ర - బెలగాం : వైద్య, ఆరోగ్యశాఖ సబ్ సెంటర్లలో గత 7 సంవత్సరాలుగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సిహెచ్‌ఓల) సమ స్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపిఎంసిఎ జిల్లా అధ్యక్షులు సి. జగదీశ్ కుమార్ ఆధ్వర్యంలో సిహెచ్‌ఓలు మంగళవారం కలెక్టర్ ఆఫీస్ నుండి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటికి 9 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 10 వేల మంది సిహెచ్‌ఓలు తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 23% వేతనం పెంచాలని, డిమాండ్ చేస్తూ శాంతియుతంగా తమ ఆందోళన నిర్వహిస్తున్నప్పటికీ కనీసం చర్చించి సమస్యలు పరిష్కరించడానికి కూడా ప్రభుత్వం సిద్ధపడటం లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వద్దకు వెళ్తే జాబ్ తీసేస్తాం, మీరు కాంట్రాక్టు ఉద్యోగులని బెదిరింపు దోరణిలో సిహెచ్‌ఓల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని మంత్రి మాటలను అసోసియేషన్ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామని తన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, చర్చలు జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను మరింత ఉదృతంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని ఎపిఎంసిఎ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ టి. ఇంద్రాణి, పబ్లిసిటీ సెక్రెటరీ కె. శిరీష, కోశాధికారి రాజేశ్వరి, నాయకులు జాకబ్, యువకాంత్, యశ్వంత్ 250 మంది సిహెచ్‌ఓలు పాల్గొన్నారు.

నవధాన్యాలు సాగు - నేల తల్లిబాగు

విశాలాంధ్ర - పార్వతీపురం : మండలంలోని డోకిశీలగ్రామంలో ప్రకృతి వ్యవసాయం ఎన్ ఎఫ్ఏ ఆర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులకు నవధాన్య కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవ సాయం చేయటం వలన భూమిఆరోగ్యం, మన ఆరోగ్యం ఉంటుందని, బావితరాలు మనుగడ సాగాలి అంటే ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. వైశ్రీరాములు మాట్లాడుతూ భూమి నిరంతరం ఏదోఒక పంటతో కప్పిఉంచాలని, దీని వలన భూమి తేమగావుండి నీటి సామర్థ్యం కలిగి ఉంటుందన్నారు. వానపాములు అభివృద్ధి చెందుతాయని, దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. వరి పంట 45 రోజులు ముందు 30రకాలు నవధాన్యాలు వేసుకుని అందులో ఆకుకూరలు, బెండ, ముల్లంగి పంటలు తీసుకుని మిగిన పంటలు పశువులకు మేతగా ఉపయోగించుకోవాలని తెలిపారు. మిగినవి భూమిలో కలియదున్నాలని, దీని వలన భూమికి మొక్కలకు అన్ని రకాలు పోషకాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు షేక్ మంగ, ఎం.శ్రీరాములు, జీతవుదు, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ధ్యేయంగా ఆరోగ్య సర్వేలు నిర్వహించాలి : డీఎంహెచ్వో భాస్కర్‌రావు

విశాలాంధ్ర - కొమరాడ : ప్రజారోగ్యం దృష్ట్యా ప్రతీ ఆరోగ్య కార్యక్రమానికి సంబంధించి సర్వే పక్కగా చేపట్టాలని డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్ భాస్కరరావు స్పష్టం చేశారు. మంగళవారం కూనేరు రాంబద్రపురం కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిప్యూటీ డిఎంహెచ్వో పద్మావతి మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో మంగళవారం డిప్యూటీ డిఎంహెచ్వో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ గ్రామాల్లో ఆరోగ్య సేవలు అందుతున్న తీరు పై,ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్షించి ప్రగతి నివేదికలను పరిశీలించారు.కొత్తగా నివేదించిన ఆశా సర్వే రికార్డ్స్ పై ఏమేరకు పరిజ్ఞానం ఉందో గమనించారు.ప్రతీ గ్రామానికి

సంబంధించి ఇంటింటి సర్వే,గర్భిణీ నమోదు, కాన్పు వివరాలు, కుటుంబ నియంత్రణ, సంక్రమిత/ అసంక్రమిత వ్యాధులు నమోదు చేయాలన్నారు. బాల్యంలో పిల్లల ఆరోగ్య సంరక్షణ, ఎదుగుదల క్రమంలో ఆరోగ్య సమస్యలు,లోపాలు ముందు గానే గుర్తించడంపై దృష్టి సారించాలన్నారు. క్షేత్ర స్థాయిలో జ్వరాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదని ఫీవర్ సర్వే పక్కగా చేపట్టాలన్నారు. దోమల నివారణకు ప్రస్తుతం కొనసాగుతున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో జరిగేలా పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు గుర్తిస్తే సత్వరమే తెలిజేయడంలో ఆశ కార్యకర్తలు క్రియాశీలకంగా ఉండా లన్నారు. ఓఆర్ఎస్, మందులు అన్ని గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. సికిల్ సెల్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలు మెరుగైన వైద్య సేవలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అరుణ్ కుమార్ నాయుడు డాక్టర్ శ్యామల్ డాక్టర్ గణేష్ పట్నాయక్ శ్రీనివాసరావు సన్యాసిరావు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలి

సిఐటియు నాయకులు సాగిన చిరంజీవి డిమాండ్

విశాలాంధ్ర - చింతపల్లి : ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, అదే క్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు గళం విప్పారు. సిఐటియు నాయకుడు సాగిన చిరంజీవి ఆధ్వర్యంలో మంగళవారం ఆశా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పని చేస్తున్న ఆశా కార్యకర్తలతో తమ న్యాయ మైన కోరికలు తీర్చాలంటూ ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ శివప్రసాద్‌కి ఆశా కార్యకర్తలతో కలిసి సమ్మె నోటీసు ఇచ్చారు. ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి 26 వేల రూపాయలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా గుర్తించాలని, ఒప్పంద జీవోలను విడుదల చేయాలని,. నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని,. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్న డిమాండ్స్ సాధనకై కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈనెల 20 న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో ఆశా వర్కర్లు అందరు భాగస్వాములు కావాలన్నారు. కార్మికులను, యజమానులను కట్టు బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు చేయాలని. ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని, ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఒప్పంద జీఓ లను విడుదల చేయాలని, చట్ట పరమైన సౌకర్యాలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని గత 20 ఏళ్ళుగా పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నా, ప్రభుత్వం వీరి సేవలను గుర్తించి కార్మికులుగా గుర్తించాలని ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ నియామకాలు ప్రభుత్వము చేపట్టాలని, విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు అనారోగ్యంతో ఆశా కార్యకర్తలు మరణిస్తే ప్రభుత్వం గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఏజెన్సీలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశ వర్కర్లుగా గుర్తించాలన్న డిమాండ్లతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్తంగా సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొవాలని యూనియన్ కమిటీ నిర్ణయించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆశా కార్యకర్తలందరూ ఈనెల 20న జరిగే సమ్మెలో పాల్గొని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆ పీహెచ్సీ వైద్యాధికారి శివప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆశా కార్యకర్తలతో కలసి అందజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు. మజ్జి రాంబాబు. ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, రవణమ్మ, స్రవంతి, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం : గ్రంథాలయ అధికారిని సునీత

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : యోగతోనే పరిపూర్ణ ఆరోగ్యమని స్థానిక గ్రంథాలయ శాఖ అధికారిని శెట్టి. సునీత అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం యోగ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగ వల్ల అనేక లాభాలు ఉన్నాయని ఆమె చెప్పారు. గ్రంథాలయం దేవాలయంతో సమానం అని ప్రతి విద్యార్థి, విద్యార్థిని మరింత విజ్ఞానం పెంపొందించేందుకు గ్రంథాలయానికి తప్పనిసరిగా ఆశ్రయించాలని ఆమె చెప్పారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు నిర్వహిస్తున్న వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తామని అని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ శాఖ సిబ్బంది సుబ్బారావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో పచ్చి రొట్ట విత్తనాలు

విశాలాంధ్ర - కొయ్యూరు : మండల వ్యవసాయ రైతాంగానికి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులోకి వచ్చాయని మండల వ్యవసాయ అధికారిని డి ఉమాదేవి తెలిపారు. రైతులకు సరఫరా చేసేందుకు 2,400 కిలోల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు వీటిలో జనుము 1400 కిలోలు, ఇతర రకాల పచ్చిరొట్ట విత్తనాలు ఒక టన్ను అందుబాటులోఉన్నాయని తెలిపారు. వీటిని కావలసిన రైతులు తమ పరిధిలో గల రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఆమె తెలియజేశారు. ఈ పచ్చి రొట్ట విత్తనాలు ఖరీఫ్ సీజన్లో వరినాట్లు వేసే ముందు వంట పొలాల్లో వీటిని జల్లుకుంటే పంటలకు ఎంతగానో బలం చేకూరుతుందని వాటి ద్వారా పంట దిగుబడి అధికమవుతుందని తెలియజేశారు. వీటిని మండల వ్యవసాయ రైతాంగం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

కిషోరి బాలికలకు రెండవ షెడ్యూల్‌పై అవగాహన

విశాలాంధ్ర - కొయ్యూరు : వేసవి శిబిరంలో కిషోరి బాలబాలికలకు నేర్పిస్తున్న ప్రతి అంశం ఏంతో ప్రాధాన్యత తో కూడినదని ఇలాంటి ఉపయోగకర విద్య, రుతు క్రమ, పరిశుభ్రత, లైంగిక విద్య పట్ల అవగాహన కల్పించుకోవటం తద్వారా ఆత్మసైర్యంతో ముందడుగు వేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిణి విజయకుమారి అన్నారు. "కిషోరి బాలికల వేసవి శిబిరం రెండవ రోజు కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొయ్యూరు లో పది, ఇంటర్ తదితర బాలబాలికలకు ' కిషోరి వికాసం ' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రుతు క్రమ, పరిశుభ్రత, లైంగిక విద్య పై వైద్య శాఖ సిబ్బంది, సూపర్వైజర్స్ తదితర శాఖల వారితో బాలబాలికలకు అవగాహన కల్పించారు.ముందుగా వీరికి ఆట విడుపు ఆట పాటలతో కార్యక్రమం ద్వారా పరిచయం చేసి ఆనందకర అంశాలపై తెలిపారు.ఈ శిక్షణ, అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది హెచ్ వి, హెల్త్ సువర్వ్యజర్స్ మాట్లాడుతూ రుతు క్రమ అంశాలపై అవగాహన కల్పించారు. లైంగిక విద్య పై పూర్తి అవగాహన కల్పించి భవిష్యత్ ఎదుర్కొనే వాటిని విపులముగా తెలియజేసారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్స్ కనక మహాలక్ష్మి, కొండమ్మ, సునీతా, బాలమణి తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఘనంగా మోదకొండమ్మ జాతర చివరి రోజు

విశాలాంధ్ర - హుకుంపేట : కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి హుకుంపేట మోదకొండమ్మ తల్లి జాతర చివరి రోజు మంగళవారం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది స్థానిక అమ్మవారి ఆలయం నుంచి ఘటాలు ఊరేగించి శతకం పట్టు వద్ద ప్రతిష్ఠించి జాతరను ప్రారంభించి మూడు రోజులు ఘనంగా నిర్వ హించటం అనవాయితి. అదే మాదిరిగా ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించారు. ఈ పండగా పాడేరు పండగాకు వారం రోజుల ముందు నిర్వహించటంతో భక్తులు, ప్రజలు వేల సంఖ్యలో వస్తారు. జాతర ముగింపు సం దర్భంగా మంగళవారం తెల్లవారు నుండే వేలాది మంది భక్తులు అమ్మ వారి ఘటాలతో ఆలయానికి చెరు కుని పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకొన్నారు. దీంతో మద్యాహ్నం 2 గంటల వరకు భక్తులు క్యూలో ఉండి మొక్కుబడ్లు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి, మైదాన ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం కమి టీ సభ్యులు ఆలయం వద్ద ఇబ్బం దులు పడకుండ తగిన ఏర్పాటు పండగ కమిటీ సభ్యులు చేశారు. స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ సన్యాసినాయుడు, సబ్ ఇన్స్పెక్టర్ సురేష్‌లు ఆధ్వర్యంలో పండగలో ఎటువంటి ఆవచ్చినయా సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

త్రాగునీటి ఎద్దడి నివారణ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని పెద్దమట్టపల్లి గ్రామ పంచాయితీ పరిదిలోని గుర్రంపేట గ్రామంలో వేసవి కాలంలో మంచినీళ్ల కోసం గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలుసుకున్న సర్పంచ్ వెట్టి లక్ష్మి వారికి వేసవిలో మంచి నీటి ఎద్దడి లేకుండా సోమవారం మంచినీటి చేతి పంపులను ఫ్లెస్సింగ్ చేయించారు. త్రాగు నీటి ఇబ్బందిని తీర్చినందుకు గ్రామస్తులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్య క్రమంలో సచి వాలయం సిబ్బంది, సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్, జిల్లా కమిటీ సభ్యులు సోయం. చినబాబు, పోడియం.శ్రీరామ్ మూర్తి, గ్రామస్తులు కారం లక్ష్మణ్‌రావు, కారం గోపి పాల్గొన్నారు.

మండల టాపర్ వరుణ్‌కు సన్మానం

విశాలాంధ్ర - కూనవరం : ప్రతీ విద్యార్థి చిన్ననాటి నుండే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ముందుకు సాగాలని కూనవరం అటవీశాఖ అధికారి కరుణాకర్ అన్నారు.ఇటీవల పదవతరగతి పరీక్ష ఫలితాలలో 532 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల పరిధిలో మండల టాపర్ గా నిలిచిన ఏసుపాక వరుణ్ ను మంగళవారం స్థానిక కూనవరం ప్రెస్ క్లబ్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేంజర్ కరుణాకర్ మాట్లాడుతూ చిన్న నాటి నుండే లక్ష్యం ఏర్పాటు చేసుకుని, 8వ తరగతి రాగానే ఆ లక్ష్యాన్ని బలపరుచుకోవాలని అన్నారు. ఆ విధంగా జీవిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నం చేయాలని అన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించగానే విద్యార్థికి రెక్కలు వస్తాయని, చెడు మార్గాల్లో పయనించేందుకు మనసు ఆ వైపుగా వెళ్తుంది అని, అప్పుడే అదుపు తప్పకుండా విద్య వైపు దృష్టి సారించాలని అని అన్నారు. ఏజన్సీలో విద్యార్థులు, విద్యార్థుల చదువు కష్టతరంగా ఉంటుందని, అయిన ఇక్కడి విద్యార్థులు అన్ని కష్టాలను ఎదుర్కొని ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు అని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఏసుపాక వరుణ్ కి ఆయన తల్లిదండ్రులు ఏసుపాక రవికుమార్, దుర్గలను మండల విద్యాశాఖ అధికారి లక్ష్మయ్య, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పరిటాల. వెంకట్, రేంజర్ కరుణాకర్ దుస్సలు వాతో సన్మానించారు. అనంతరం ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ అనిల్, కృష్ణ, లోకేష్, వినయ్ ప్రసాద్, నవీన్, ఇంతియాజ్, నాగబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అనంతగిరి : 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి సిఐటియు మండల కార్యదర్శి కిల్లో. మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు అనంతగిరి భీమవరం లుంగపర్తి పిహెచ్సి డాక్టర్లకు సీటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మోస్య మాట్లాడుతూ4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్స్ తో దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు ఆశ వర్కర్లు కూడా అందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతగిరి పిహెచ్సిలో జడ్పీటీసీ సభ్యులు దీసరి గంగరాజు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు లుంగపర్తి లో సీవేరి కొండలరావు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు ఈకార్యక్రమంలో జేష్ట వెంకటరమణ పాంగి రాజరావు ఆశావర్కర్లు సింహాచలం దేముదుమ్మ రాజేశ్వరి సుందరి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలు వెల్లువ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖ పల్లిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయములం సమావేశ హాలు నందు మంగళవారం ఎంపీపీ కారం. లక్ష్మి అధ్యక్షతన నిర్వ హించారు. సమావేశమునకు సర్పంచులు, ఎంపీటీసీలు అధికారులు హాజరు అయ్యారు.ఈ సందర్భంగా ఎంపీపీ కారంలక్ష్మి, జడ్పిటిసి, వాళ్ళ రంగారెడ్డి మాట్లాడుతూ ఎండాకాలం కారణంగా మండలంలో అక్కడక్కడ మంచినీటి ఎద్దడి ఉందని ప్రజలకు ఇబ్బంది లేకుండా సర్పంచ్ సంబంధిత శాఖ అధికారులు వెంటనే మంచినీటి సమస్య పరిష్కరించాలని సూచించారు. శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ మాట్లాడుతూ వి

ఆర్ పురం బీసీ కాలనీ నుంచి రేకపల్లి ఎమ్మార్వో ఆఫీస్ సెంటర్ వరకు వెట్ మిక్స్ చేసి వదిలేసిన తారు రోడ్డు ఎప్పుడు వేస్తారని సంబంధిత అధికారిని నిలదీయడం జరిగింది. దీనిపై స్పందించిన ఆ శాఖ నుండి హాజరైన ప్రవీణ్ మాట్లాడుతూ వారం రోజుల్లో తారు వేసే పనులు ప్రారంభిస్తామనిసభకు తెలిపారు. గుర్రంపేట, చినమట్టపల్లి గ్రామాలలో విద్యుత్ శాఖ వారు విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం మరిచారని త్వరగా కనెక్షన్ ఇచ్చి కరెంట్ సదుపాయం కల్పించాలని చిన్న మట్టపల్లి ఎంపిటిసి పూనం ప్రదీప్ కుమార్ ప్రశ్నించారు. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ మూడు నాలుగు రోజుల్లో అట్టి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో మండల ప్రజా పరిషత్ ఎంపీడీవో ఆంజనేయులు, వైస్ ఎంపీపీలు ముత్యాల భవాని, వద్దాణపు భాగ్యలక్ష్మి ఎంపీటీసీలు వాళ్ల వెంకటేశ్వర్ రెడ్డి సర్పంచులు పూనం సరోజిని, వెట్టి లక్ష్మి కారం బుచ్చమ్మ, వద్దాణపు శారద, సోడె నరసమ్మ, పిట్టా రామారావు, ముట్ల బాలరాజు, గ్రామ పంచాయతీ సెక్రెటరీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కిషోర బాలికల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర - కురుపాం : కిశోర బాలికల అభివృద్ధి, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పైల జానకమ్మ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండలంలో మొండెంఖల్, నీలకంఠాపురం పంచాయతీల పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్య, బాల్యవివాహాలు పునరుత్పత్తి ఆరోగ్యం-ప్రభావాలు, పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కిశోర వికాసంపై వేసవి శిక్షణ అం శాలను గూర్చి అంగన్వాడి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పాడేరు గిరిజన సహకార సంస్థ ఉద్యోగులంత మంగళవారం విధులకు డుమ్మా ...?

ఎటువంటి అనుమతి లేకుండా అమ్మవారి పాదాల్లో విందులు చిందులు...? చర్యలు ఉంటాయో...? లేదో....?!

విశాలాంధ్ర - పాడేరు న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సహకార సంస్థ అధికార్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా గిరిజన సహకార సంస్థ బలోపేతానికి కావచ్చు, లేదా సంస్థ ద్వారా లబ్ధిదారులకు నిత్యావసర వస్తువుల, సరకులు సరసమైన ధరలకు మొదటి వారం నుంచి దాదాపుగా 3 వారం వరకు కార్డు లబ్ధిదారులకు అందించాల్సిన బాధ్యత వీళ్ళ పైన ఉంటుంది. కాగా మంగళ వారం అదేమీ చేయకుండా పాడేరు గిరిజన సహకార సంస్థ బ్రాంచికి చెందిన కాంట్రాక్ట్ సెల్స్ మెన్స్, రెగ్యులర్ సెల్స్ మెన్స్, గోడౌన్ ఇంచార్జీ, పాడేరు మేనేజర్, డి ఎం కార్యాలయ సిబ్బంది. ఒక మాటలో చెప్పాలంటే బ్రాంచి నుండి అందరు ఎటువంటి అనుమతి లేకుండా గుట్టు చప్పుడు కాకుండా వీళ్లంతా విధులకు డుమ్మా కొట్టి అమ్మవారి పాదాల్లో విందులు, చిందులు వేస్తూ హెంజాయ్ చేశారు. సాధారణంగా ఇటువంటి కార్యక్రమాల్లో అందరు అందుబాటులో ఉన్న ఆదివారం రోజు చేసుకొంటారు. కానీ ఈరోజు(మంగళవారం) వనిదినం కావడం తో అనేక చోట్ల కార్డు లబ్ధి దారులకు నిత్యావసర వస్తువుల, సరకులు అందలేదు వీళ్ళ కోసం ఎదురు చూస్తూ వెను తిరిగిన పరిస్థితి...కాగా అసలు ఈ విందు, చిందులు ఎవరు ఆధ్వర్యంలో జరిగింది..? ఎందుకు జరిగింది...? అనేది స్పష్టంగా లేకపోయినా విలేకర్లు గిరిజన సహకార సంస్థ లో అధికార్లకు కలవడానికి వెళ్ళినప్పుడు ఇదంతా బయట పడింది... అయితే గిరిజన సహకార సంస్థ లో ఒకరికి పదోన్నతి పొందిన సందర్భంగా ఒకరోజు సరదాగా హేంజాయ్ చేదామని ఇలా విధులకు డుమ్మా కొట్టి వెళ్లినట్లు సమాచారం.... గిరినజ సహకార సంస్థ అధికార్లు మాత్రం జీసిసి ప్రక్షాళన చేస్తాం, ఉడపొడుస్తం, మునుముందు మంచి రోజులు రాబోతున్నాయి, చూస్తూ ఉండండి అంటూ ఓ ప్రకటన మీద ప్రకటనలు చేస్తు డప్పు కోవడం చేస్తుంటే ఇలా విందులు, చిందులు చేయడమే ప్రక్షాళన చేయం అవుతుందేమో...అనే అనుమనలు కూడ ప్రజల మనసుల్లో సంచరించుకోక తప్పదు. స్థానికంగా ఉన్న గిరిజన సహకార సంస్థ చైర్మన్, ఉన్నత స్థాయి అధికార్లు ఈ సంఘటన పై స్పందించి బాధ్యుల పై చర్యలు తీసుకుంటారో...? తెలిసి కూడా తెలియనట్లు వుంటూ చర్యలకు నిస్కమిస్తారో వేచి చూడాల్సిందే...?

తారు వేయకుండా వదిలేసిన రోడ్డును పరిశీలన

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం ఆర్ పురం బీసీ కాలనీ నుండి ఎంపీడీవో కార్యాలయం రేకపల్లి వరకు వెళ్లే రోడ్డును తారు రోడ్డు నిర్మాణం పేరుతో వెట్ మిక్స్ వేసి తారు వేయకుండా వదిలేయడం జరిగిన విషయంపై స్థానిక ఎంపీపీ కారం లక్ష్మి ఫిర్యాదు మేరకు చింతూరు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అపూర్వ భరత్ ఐఏఎస్ స్పందించి, తారు వేయకుండా వదిలేసినరోడ్డును మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిపియం పార్టీ మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామ్మూర్తి, పంకు సత్తిబాబు వద్దాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవోదయం 2.0

విశాలాంధ్ర - కురుపాం : నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మన్యం జిల్లా ఎక్సైజ్ సూపరిండెండెంట్ శ్రీనాథుదు ఆధ్వరంలో మంగళవారం ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాలైన కెరడ, వనజ, వలవ, సుళవ తదితర గ్రామాల్లో అక్రమంగా నాటుసారా తయారీ చేస్తున్నట్లు ముందస్తు సమాచారంతో ఏపీ, ఒడిశా ఎక్సైజ్ సిబ్బంది సంయుక్తంగా నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 460 లీటర్ల నాటుసారాతోపాటు, 9,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ పి. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పరిసర గ్రామాల ప్రజలకు అక్రమంగా నాటుసారా తయారీ చేసినా, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో కురుపాం, విజయనగరం, రాయగడ, సీతానగరం, సాలూరు ఎక్సైజ్ అధికారులు రామచంద్రకుమార్, పద్మావతి రాజేశ్వరి, రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్లకు ఒక రోజు శిక్షణ

విశాలాంధ్ర - చింతూరు : అల్లూరి సీతా రామరాజు జిల్లా చింతూరు మండల పరిధిలోని తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశ వర్కర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ ఉదయ్ కుమార్ రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య సంరక్షణ, విద్య. ఈ ఆశ యాప్ ఆశ సర్వీస్ రికార్డ్స్ మ్యాడ్యూల్ పై ఓరియం టేషన్ ప్రెగ్నెన్సీ కిడ్స్. ఈ ఆశ యాప్, సర్వీస్ అప్డేట్ల పర్యవేక్షణ. గురించి సోదా హరణంగా వివరించారు. అందులో భాగంగా ఈ ఆశ సమా వేశంలో ఆశాలకు యూనిఫామ్ మెడికల్ ఆఫీసర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ రవ్వ వీరమ్మ మాట్లాడుతూ మాకు ఎంతో సలహాలు సూచనలు ఇస్తూ వైద్య పరంగా సేవలో అందిస్తురన్నారు. ఈ సమావేశంలో ఆశ వర్కర్లు, సూపర్వైజర్స్. ఏఎన్ఎం. హెల్త్ అసిస్టెంట్. ఆశాలు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

విశాలాంధ్ర - సీతంపేట : పాలకొండ నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మక. జయ కృష్ణ బుధవారం పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారని తెలిపారు.సీతంపేట మండలం మల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కాబడిన పాఠశాల ప్రహరీ గోడ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొంటారు.

17 పరీక్షా కేంద్రాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ

జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మంజుల వీణ

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో ఈనెల 12 నుంచి 20వరకు జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ సప్లిమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని, 17 కేంద్రాలలో సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.మంజులవీణ తెలిపారు. ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆడిటోరియంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం నాడు కళాశాలల చీఫ్ సూపరింటెండెంటులు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్స్ స్క్వాడ్, తదితర పరీక్షల నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మే 12 నుంచి 20వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, ఒకేషనల్ మరియు జనరల్ గ్రూపుల నుంచి 4,914 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. వీరిలో జనరల్ కోర్సులకు చెందిన విద్యార్థులు 3830 మంది కాగా, ఒకేషనల్ విద్యార్థులు 1084మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షలు ఉదయం 9.00 గం.ల నుంచి మధ్యాహ్నం 12.00గం.ల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 గం.ల నుంచి సాయంత్రం 5.30గం.ల వరకు జరుతాయని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఇందుకు తగినవిధంగా ఆర్టిసి బస్సులను నడిపేందుకు ఆర్టీసీ అధికారులు అంగీకరించారని తెలిపారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని, నిరంతర విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లు కల్పించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స తదితర ఏర్పాట్లుచేయాలని సంబంధిత అధికారులను ఆమె కోరారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు సెల్ ఫోన్లు వాడరాదని, 144 సెక్షన్ అమలు చేయాలని ఇప్పటికే జిల్లా రెవెన్యూ అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వివిధ శాఖలతో జిల్లా రెవెన్యూ అధికారి సమన్వయ సమావేశాన్ని ఏర్పాటు చేసి అన్ని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో పరీక్షలకు సంబంధించి ఇప్పటికే పరీక్షా పత్రాలను 13 స్టోరేజ్ పాయింట్లలో భద్రపరచడం జరిగిందన్నారు. మార్చినెలలో జరిగే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల్లో కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించాలన్నారు.

రైతులకు విత్తనాల కిట్లు పంపిణీ

విశాలాంధ్ర - బలిజిపేటపేట : మండలం సుభద్ర రైతు సేవా కేంద్రం వద్ద ఎంసిఆర్పిలక్ష్మీ మేడం, ఆర్ఎస్కే ఇంచార్జ్ హేమంత్ సమక్షంలో పీఎండిఎస్ విత్తనాల కిట్లను తయారు చేయడం మరియు రైతులకు పంపిణీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా లక్ష్మి తిరుపతిరావు వివరిస్తూ - ప్రకృతి వ్యవసాయంలో (ప్రి మాన్సూన్ డ్రై షోయింగ్ అంటే ప్రధాన పంటకు ముందు సుమారు 30 రకాలు ఎకరాకు కనీసం 12 కేజీలు చొప్పున విత్తనాలు జల్లుకొని 40 రోజుల తర్వాత భూమిలో కలియదున్నడం)సాగు వలన రైతుకి,భూమికి, పర్యావరణానికి మరియు ప్రధాన పంట వినియోగదారునికి కలిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల విత్తనాలను వేయడం వలన ఎకరాకు సుమారు ఎనిమిది మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభించడం,జీవ వైవిధ్యముతో పాటు భూమిలో సేంద్రీయ కర్బన శాతము పెరుగుతుందని, వివిధ రకాల వేర్లు వివిధ లోతుల్లో భూములోనికి చొచ్చుకు పోవడం వలన భూమి గుల్లబారి నీటిని పట్టి ఉంచే గుణం పెరగడం వలన తేమ శాతం పెరుగుతుందని తద్వారా తర్వాత వేసిన పంటలు నీటి ఎద్దడి నుండి తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని, ప్రధాన పంటకు అన్ని రకాల సూక్ష్మ మరియు స్థూల పోషకాలు లభించడంతో పంటకు ప్రకృతి వైపరీత్యాలను, తెగుళ్ల మరియు పురుగులను తట్టుకునే శక్తి వస్తుందని వివరించారు. భూమిని పచ్చదనంతో కప్పి ఉంచడం వలన భూతాపము తగ్గి, భూమి కోతకు గురి కాకుండా ఉంటుందని పర్యావరణానికి మేలు జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, లక్ష్మి తిరుపతి రావు తోపాటు గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నిబంధనలు పాటించాలి

విశాలాంధ్ర - కురుపాం : రహదారి భద్రతా నియమాలు పాటించే వాహనాలు నడపాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ జి.సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక గాంధీ నగర్ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీలు చేపట్టారు. లోడుతో వెళ్తున్న ట్రాక్టర్లు , ఇతర వాహ నాలకు పొల్యూషన్, బ్రేక్ డౌన్ తదితర పత్రాలను క్షుణంగా పరిశీలించి ధ్రువీ కరణ పత్రాలు లేకుండా నడుపుతున్నటువంటి వాహనదారులకు అపరాధసం వేశారు. అనంతరం వాహనదారులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఇసక లోడుతో వెళ్తున్నటువంటి ట్రాక్టర్లు తప్పనిసరిగా టార్పను కప్పి తీసుకువెళ్లాలని లేదంటే వెనక నుండే ఇచ్చే వాహనదారులకు ఇసుక కంటిలో పడి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని సూచించారు.ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది వి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో నేడు ఎమ్మెల్యే పర్యటన

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి బుధ వారం పర్యటించనున్నారు. వివరాలలోకి వెళితే మండలంలో ఉన్న జియ్యమ్మ వలస నుండి పార్వతీపురం ఆర్అండ్బి రోడ్డు, గెడ్డ తిరువాడ పంచాయతీ చిలకల వాని వలస మీదుగా పసుపు వాని వలస వరకు నిర్మించనున్న బిటి రోడ్డునకు శంకు స్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో గల కూటమి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలుగుదేశం పార్టీమండల కన్వీనర్ పల్ల రాంబాబు కోరారు.

ప్రకృతి వ్యవసాయంలో నవధాన్యాలు వలన ఎన్నో ఉపయోగాలు

విశాలాంధ్ర - సాలూరు : మండలంలోని ఖరాసవలస గ్రామంలో పిఎండిఎస్ నవధాన్యాల కార్యక్రమాన్ని రీజనల్ టెక్నికల్ లీడ్ ఆఫీసర్ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతులు అందరు నవధాన్యాలు చల్లకోవాలని తెలియపరిచి అవగాహన కల్పించారు.పి ఎమ్ డి ఎస్ నవధాన్యాలు వలన భూసారం పెరుగుతుందని, భూమిలో జీవవైవిద్యం పెరుగుతుందని, అనేక రకాల విత్తనాలు వెయ్యటంవలన అనేక రకాల మొక్క వేరు వ్యవస్థలో అనేక రకాల సూక్ష్మ జీవులు ఉంటాయన్నారు. నవధాన్యాలు వలన వేరు వ్యవస్థ, నేల గుల్లబారి సేంద్రియ కర్బణం వృద్ధి చెందుతుందన్నారు. యూరియా డిఏపి అవసరం లేదని, పర్యావరణం పాడవకుండా ఉంటుందన్నారు. ఆరోగ్య కరమయిన పంటలు పండించి తినటంవలన ఆరోగ్యం పాడవకుండా ఉంటుందన్నారు. నవధాన్యాలు వేయటం వలన అదనపు ఆదాయం పొందవచ్చని పశువులు మేత అందుతుందని, పశువుల పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. నవధాన్యాలు వేసిన నలభై రోజుల తరువాత కలియదున్నటం వలన ప్రధాన పంటకు కావలసిన పోషకాలు అభివృద్ధి చెందుతాయని, ప్రధాన పంటలో కలుపు నివారణ అవుతుందని రీజనల్ టెక్నికల్ లీడ్ ఆఫీసర్ ప్రకాష్ వివరించారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు హాజరయారు.

పీసా ఎన్నికలు వాయిదా..

విశాలాంధ్ర - వై.రామవరం : మండల కేంద్రమైన వై.రామవరంలో మంగళ వారం నిర్వహించాల్సిన పీసా గ్రామసభ ఎన్నికలు మరోసారి వాయిదా వేసినట్లు ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు. పీసా కమిటీకి ఉపాధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నికకు కోరంకు సంబంధించిన ఓటర్లు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు. ఇప్పటికీ ఈ పీసా ఎన్నికలు పది సార్లు వాయిదా పడ్డాయి అని ఆయన తెలిపారు.

ఆశా కార్యకర్తలకు ఏకరూప దుస్తులు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : స్థానికప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోగల వివిధ సబ్ సెంటర్లలో విధులు నిర్వర్తిస్తున్న ఆశా కార్యకర్తలకు ఇక్కడి వైద్యాధికారి పాంగి రాంబాబు మంగళవారం ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఏకరూప దుస్తులను ధరించి విధులకు హాజరు కావడం ద్వారా విధులు నిర్వర్తిస్తున్న శాఖ ఏమిటన్నది ప్రతి ఒక్కరికి తెలుస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఏకరూప దుస్తులను ధరించి విధులకు హాజరు కావలసిన అవసరం ఎంతైనా ఉందని ఆశా కార్యకర్తలకు వైద్యాధికారి సూచించారు. సీజనల్ వ్యాధులు ఏ ఒక్కరికి సోకకుండా ఉండేందుకుగాను ఆశా కార్యకర్తలు అంకితభావంతో విధులు నిర్వహించి వ్యాధుల అదుపుకు ప్రత్యేక కృషి సేవలు అందించాలన్నారు. అదేవిధంగా ఎవరికి ఎటువంటి వ్యాధులు సోకిన నిర్లక్ష్యాన్ని వీడి వైద్యులకు సమాచారం అందించడంలో ముందంజలో ఉండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు శెట్టి స్వామి, శెట్టి ప్రభాకర్, కమ్మిడి హరికృష్ణ, కమ్మిడి రవీంద్ర, లవ రాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కంతపోలమ్మ తల్లి గ్రామదేవత పండగ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని బగ్గందొరవలస గ్రామంలో కంతపోలమ్మ తల్లి గ్రామదేవత పండుగ సోమవారంనాడు ప్రారంభమై, మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. పండగలో ప్రధానమైన సిరిమాను రథంను పూజారి అధిరోహించిన తర్వాత గ్రామంలో జేజేలు పలుకుతూ ఊరేగింపు జరిపారు. పెద్ద ఎత్తున వివిధ గ్రామాల నుండి భక్తులు, బంధువులు, అన్నిపార్టీల నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.పలు సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామంలోప్రతిఇంటి నుండి కనీసం లక్ష రూపాయలు నుండి రెండు రూపాయల వరకు పండగ కోసం ఖర్చు చేశారు. మంగళవారం నాడు పెద్దఎత్తున గొర్రెలు, కోళ్లను కోసి ఆడపిల్లలకు, బంధువులకు, స్నేహితులకు మంచి భోజనాలు పెట్టారు.ఇదిలాఉండగా కంతపోలమ్మ తల్లి గ్రామదేవత పండుగకు మంగళవారం విచ్చేసిన బంధువులు స్నేహితులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. వాహనాలు ఇరుక్కుపోయి గంటల తరబడి రోడ్డుపై నిరీక్షించాల్సి వచ్చిందిన్నారు. పార్వతిపురం సర్కిల్ పరిధిలోగల పోలీస్ సిబ్బంది, స్పెషల్ పార్టీ పోలీసులు వచ్చి ట్రాఫిక్ నియంత్రణతో పాటు, సినిమాను రథం తిరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి కుమార్ వర్మ,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది దగ్గరుండి గ్రామాల్లో పారిశుధ్యము తొలగించడంతోపాటు ముందుగా గ్రామాన్ని పరిశుభ్రం చేశారు. గ్రామంలో నాయకులు కమిటీ సభ్యులు యువత పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఎండలను లెక్కచేయకుండా పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడం గమనార్హం. పార్వతీపురం గ్రామీణ సి ఐ గోవిందరావు ఎస్సైలు నీలకంఠం సింహాచలం, ఏఎస్ఐలు శ్రీనివాసరావు, లక్ష్మణరావు,పోలీస్ సిబ్బంది దగ్గరుండి బందోబస్తు నిర్వహించారు. ఎక్సైజ్ సిఐ డి పద్మావతి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది కూడా నాటుసారా రవాణా లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

20న జరిగే సమ్మెను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆస కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సమ్మె నోటీసును స్థానిక వైద్యాధికారికు సిఐటియు ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం చెల్లించి కనీస వేతనం రూ 20000 లు ఆశ కార్యకర్తలకు చెల్లించాలని డిమాండ్. దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో కార్మికులు ఆశ కార్యకర్తల అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు దోమల మందు పిచికారి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం రేఖ పల్లిలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో గల మలేరియా ప్రభావిత గ్రామాలలో డాక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మొదటి విడత దోమల మందు ఏసీఎం 5% మందును పిచికారి చేయ టం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు అందరు తమ ఇండ్ల లోని సామానులుఅన్ని సర్దుకొని లోపల ,బయట ఈ మందును చల్లించటం వలన మలేరియా డెంగ్యూ వంటి వ్యాధులు నుండి రక్షణ కలుగుతుందని, మలేరియా ను తగ్గించవచ్చు నని తెలిపారు. దోమ తెరలు ను వాడాలని, ప్రతి ఒక్కరూపరిసరాల పరిశుభ్రత పాటించాలని పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంటి ఎస్.రాజేష్, ఎంపిహెచ్ఈఓ సమ్మయ్య, హెచ్ఏలు శ్రీనివాస్, సత్యనారాయణ, ఏఎన్ఎంలు. కె.పార్వతి ఎం.పార్వతి ఆశలు, రాధా పాల్గొన్నారు.

20 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : దేశవ్యాప్త కార్మిక, కర్షక సమ్మె ఈనెల 20న చేపట్టనున్న నేపథ్యంలో స్థానిక మున్సిపల్ పారిశుధ్య రెగ్యులర్, కాంట్రాక్ట్ కార్మికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బి వి రమణ మాట్లాడుతూగత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసేందుకు రాష్ట్రంలోనే ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమని విమర్శించారు.మరల కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికుల నియామకాల్లో రాజకీయ నాయకుల ఆధీనంలోని ప్రైవేట్ ఏజెన్సీల ప్రభావం పెరుగుతుందని ఇది ఒక రకంగా అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు పొందే అవకాశం కోల్పోయేలా చేస్తుందని, ప్రతి నెల జీతాలు సకాలంలో పొందే అవకాశం పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.. ప్రస్తుతం అమలు అవుతున్న ఆప్కాస్ విధానాన్ని కొనసాగించాలని, రెగ్యులర్ ఉద్యోగులకు పి ఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికులు ఉద్యోగులకు నష్టం చేసే లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, పెరుగుతున్న నిత్యావసర సరుకులు ధరలు అదుపు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలనే డిమాండ్స్ తో మే 20న దేశ వ్యాప్త కార్మిక, కర్షక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జరుగుతుందని ఆ సమ్మెను జయప్రదం చేసేందుకు అన్ని రంగాల కార్మికులు ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బంకురు సూరిబాబు, సింహాచలం, శంకరరావు, రవి, గంగరాజు,శివ పాల్గొన్నారు.

బీసీ మహిళలకు అన్యాయం...వైకాపా ఆరోపణ

విశాలాంధ్ర - కూనవరం : బీసీ మహిళలకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టిందని కుట్టుమిషన్ల ట్రైనింగ్ పథకం పేరుతో కొనుగోలులో అవినీతికి పాల్పడిందని వైఎస్ఆర్సిపి బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులు మరియా దాసు ఆరోపించారు.బీసీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలకు కుట్టు మిషన్ల పంపిణీ ట్రైనింగ్ అనే పథకంలో లక్ష మంది బీసీ లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి 23 వేల రూపాయలు ఈ పథకం ద్వారా అందిస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం 230 కోట్లు కేటాయించి ఒక్కొక్క లబ్ధిదారునికి ట్రైనింగ్ నిమిత్తం 3000 రూపాయలు 4300 ఖరీదు చేసే నాసిరకం కుట్టు మిషన్లను అందించారని ఒక్కొక్క లబ్ధిదారునికి 23,000 కేటాయించి కేవలం 7300 రూపాయలు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు.ఎన్నికల హామీలలో బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి ఉన్న పెన్షన్లను కత్తిరించే పనిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు యువగళం పాదయాత్రలో బీసీలకు రక్షణ చట్టం ఏర్పాటు చేస్తానని లోకేష్ పాదయాత్రలో చెప్పారని 11 నెలలు గడిచిన పట్టించుకోలేదన్నారు ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దికొండ గంగాధర్ బీసీ నాయకులు చెవుడు బోయిన మధు చామంతుల వెంకన్న కల్లం వీరాంజనేయులు మేడిది నాగేంద్ర మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షులు మహమ్మద్ రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో స్నేహ భావం పెంపొందించేందుకే వీబీఎస్

విశాలాంధ్ర - ఎటపాక : పిల్లల్లో స్నేహ భావం, సద్గుణాలు పెంపొందేందుకే సండే స్కూల్ పిల్లలకు ప్రత్యేకంగా వీబీఎస్ తరగతులు నిర్వహిస్తున్నట్లు యేసుక్రీస్తు సీయోను మినిస్ట్రీస్ పాస్టర్ నవీన్ లాజరస్ అన్నారు. ఎటపాక మండలం మేడువాయి యేసు క్రీస్తు సీయోను మినిస్ట్రీస్ చర్చిలో ఒకరోజు సండే స్కూల్ పిల్లలకు వీబీఎస్ (ఒకేషనల్ బైబిల్ స్కూల్) తరగతులు నవీన్ లాజరస్, హెప్సీబా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగంగా హైదరాబాద్ నుంచి వచ్చిన బెరాక చర్చి పాస్టర్ హారీష్, ప్రియా హారీష్ పిల్లలకు సండే స్కూల్ పాటలు, ఆటలతో పాటు నీతి కథలు వివరించారు. పిల్లలకు నిర్వహించిన ఆటలు సందడిగా జరిగాయి. ఈ సందర్భంగా నవీన్ లాజరస్ మాట్లాడుతూ ఎండాకాలం సెలవుల్లో పిల్లలకు ప్రత్యేకంగా ఈ తరగతుల ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వందల మంది పిల్లలు హాజరవుతారని తెలిపారు. సమాజంలో శాంతి, సమాధానం పెరిగేలా తమ వంతు కృషి చేస్తున్నట్లు గుర్తు చేశారు. నందిగామ, గన్నవరం, గౌరిదేవిపేట కలని, సీతా పురం, కాపవరం, ఏలూరు జిల్లా భువనగిరి, భర్గం పాడు, అల్లిగూడెం, కివ్వాక, తెలంగాణ పరిధిలోని వాజేడు, వెంకటాపురం, సున్నంబట్టి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పిల్లలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఒనేసిము, రవికాంత్, తిమోతి, పెదబాబు, ఒబాద్య, ఖ్యాతి, రిభ్కా, దావీదు, కృపారాణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే ప్రక్రియ జాప్యం చేస్తే సహించేది లేదు : జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : భూములు రీ సర్వే ప్రక్రియ జాప్యం చేస్తే ఉపేక్షించనని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. భూముల సర్వే సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కార్ఫరెన్సు మందిరం నుండి 22 మండలాల రెవెన్యూ అధికారులు, సర్వే అధికారులతో వారాంతపు రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియను నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. రెవెన్యూ కార్య క్రమాలను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. గ్రామసభలు సభలు నిర్వహించిన తర్వాత అందిన దరఖాస్తులను సకా లంలో పరిష్కరించాలని, మ్యుటెషన్లను వేగ వంతం చేయాలని ఆదేశించారు. రిసర్వేలో భాగంగా సంబంధిత అధికారులు లాగిన్ అయి పెండింగ్ లేకుండా చూడాలని, ఎవరి లాగిన్ లో పెండింగ్ ఉంటె వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలపై సరిగా స్పందించని ముంచింగిపుట్టు తహసిల్దార్ కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఆర్ఓ ను ఆదేశించారు. గత వారం నుండి ఇప్పటివరకు నిర్వహించిన సర్వే, తీసుకున్న చర్యలపై ఆరా తీసారు. ప్రతి వారం కలెక్టర్ సమీక్షకు ముందుగానే తహసిల్దార్లు సంబంధిత సిబ్బందితో సమీక్షించి కలెక్టర్ సమీక్షకు పూర్తి వివరాలతో హాజరు కావాలన్నారు. జూన్ 15లోగా నోటిఫికేషన్ -13 ను జారీ చేసే విధంగా ఈ ఐదు వారాల వీక్లీ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదే శించారు. రెవెన్యు సదస్సులలో అందిన విజ్ఞాప నలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదే శించారు. గృహనిర్మాణాలకు అందిన దరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములలో ఉన్న ఆక్రమణలను ప్రతి శనివారం పబ్లిక్ కన్వియన్స్ డేగా గుర్తించి ఆక్రమణలను పద్ధతి ప్రకారం తొలగించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.ఎం.జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి పాల్గొన్నారు.

అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించిన ఆర్జెడి చిన్మయిదేవి

విశాలాంధ్ర - సీతంపేట : మండలం సోమగండి పంచాయతీ పరిధిలో గల ఎర్రకువ్వరిగూడా, అక్కన్నగూడ అంగన్వాడి కేంద్రాలను ఐసిడిఎస్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ చిన్మయి దేవి సందర్శించారు. కిషోర్ వికాసం తరగతులు క్రోమోరదశ బాలికలు వారు పాటించవలసిన జాగ్రత్తలు తీసుకోవలసిన ఆహార పదార్థాలు ఆరోగ్యం పై ఐసిడిఎస్ సిబ్బంది అవగాహన కల్పించడం జరుగుతుందని ఆర్జెడి తెలిపారు. ఈ తరగతిలో మే 2 నుండి జూన్ 10వ తేదీ వరకు అన్ని మండలాల్లో నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కొత్తూరు, భామిని మండలాల్లో సందర్శించడం జరుగుతుంది అని తెలిపారు ఈ కార్యక్రమంలో పీడీ కనకదుర్గ ఐసిడిఎస్ పిఓ వి.రంగలక్ష్మి, సెక్టార్ సూపర్వైజర్ లావణ్య, పరిమళ, కీర్తన సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శ్రీ మోదకొండమ్మ జాతర

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు : ఈ నెల 11,12,13 తేదీలలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ జాతరలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జాతర సందర్భంగా అమ్మవారి గుడి నుండి శతకంపట్టు వరకు, అక్కడి నుండి గుడి వరకు అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలు తిరిగే సందర్భంలో అదేవిధంగా అమ్మవారి గుడి వద్ద ఎటువంటి తోక్కిసలాటకు అవకాశం లేకుండా అందరికీ దర్శన భాగ్యం కలిగే విధంగా అధికార బృందం, కమిటీ సభ్యులు సహకరించాలని సూచించారు. క్రౌడ్, ట్రాఫిక్, ట్రాన్స్ పోర్ట్ మేనేజ్మెంట్ జాగ్రత్తగా చేపట్టాలని, తాగు నీటి సమస్య లేకుండా చూడాలని, ఉత్సవం మూడు రోజులు 24 గంటల విద్యుత్ సరఫరా జరగాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని, కలుషిత ఆహార పదార్థాలు లేకుండా నాణ్యవంతంగా ఉండేలా చూడాలని, అశ్లీలతకు తావు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని వివిఐపిల సందర్శన ముందుగానే తెలుసుకొని ప్రోటోకాల్ ప్రకారం దర్శనం కల్పించాలని, స్త్రీ, శిశు రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆయా కమిటీల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యూ, నీటి సరఫరా, పంచాయతి, ఐ అండ్ పిఆర్, తదితర శాఖల సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆదేశించారు. ఉత్సవం మూడు రోజులు పాడేరు పట్టణానికి బయట పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నెల పదవ తేదీ నుండి ఉత్సవాలు ముగిసే వరకు పాడేరులో ఉన్న మద్యం షాపులు మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. మూడు రోజుల పాటు ఘాట్ రోడ్ లో భారీ వాహనాలు నిషేధం:లి ఉత్సవాల మూడు రోజుల పాటు రవాణాకు చెందిన భారీ వాహనాల రాక పోకలు నిషేదిస్తున్నందున పాడేరులో వ్యాపారులందరూ వారికి అవసరమైన సరుకులను ముందుగానే తెప్పించి స్టాక్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

గృహ విద్యుత్ ను వ్యాపారాలకు సరఫరా చేస్తే యజమానిపై చర్యలు : ఉత్సవాల సందర్భంగా అనేక ఇళ్ళ ముందు వ్యాపారాలు జరుగుతుంటాయని, ఐతే విద్యుత్ అధిక లోడ్ వల్ల షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశం ఉన్నందున, షార్ట్ సర్క్యూట్ నివారణలో భాగంగా ఇంటి విద్యుత్ ను వ్యాపారాలకు సరఫరా చేయడం, వ్యాపారానికి వినియోగించడం చేస్తే సంబంధిత యజమానులపై జరిమానాలు విధించటంతో పాటు తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్పి అమిత్ బర్దర్, జాయింట్ కలెక్టర్ డా. ఎం. జె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి : డీఎస్సీ సాధన కమిటీ

విశాలాంధ్ర - ముంచింగ్ పుట్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచింగి పుట్టు ఆదివాసి ప్రత్యేక డిఎస్సి పై ఈనెల 8న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చించి మెగా డిఎస్సి నుంచి ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులను మినహాయించి వాటితో గిరిజనులకు ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల అధ్యక్షుడు రెయ్యల నాగభూషణం, కో- ఆర్డినేటర్ వెంగడ జగన్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు. ఈ మేరకు మంగళవారం మండలంలో గల వనసపుట్టు పంచాయతీ పరిధిలోని గిద్దలపుట్టు, బొడ్డపడ, ఒంటిపుట్టు తదితర గ్రామాల్లో పర్యటించి నిరుద్యోగులతో కలిశారు. జీవో 3 రద్దుతో గిరిజన ప్రాంతంలో జరిగిన నష్టాన్ని నిరుద్యోగులకు వారు వివరించి చైతన్యపరిచారు. తక్షణమే స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీవో 3 పునరుద్ధరణ చేయాలని, ప్రత్యేక డిఎస్సి- ఆదివాసీ హక్కు అంటూ పలు నినాదాలు చేశారు. అనంతరం ప్రత్యేక డీఎస్సీ సాధన కమిటీ మండల అధ్యక్షుడు రెయ్యల నాగభూషణం, కో- ఆర్డినేటర్ వెంగడ జగన్ లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డిఎస్సిలో గిరిజన నిరుద్యోగులమైన తమను తీవ్ర నిరాశకు గురి చేసిందన్నారు. మెగా డిఎస్సి తో గిరిజన అభ్యర్థులకు జరుగుతున్న అన్యాయంపై, కోల్పోతున్న ఉపాధ్యాయ పోస్టులు, జీవో 3పునరుద్ధరణ, గిరిజనులకు నూరుశాతం ఉద్యోగాల కల్పనకు, ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలపై రాష్ట్ర కేబినెట్ లో చర్చించి గిరిజన డిఎస్సి ఆర్డినెన్స్ జారీ చేయాలని, జీవో నెం. 3 కు బదులుగా దానికి ప్రత్యామ్నాయ జీవో ను తీసుకొచ్చి డిఎస్సి లో షెడ్యూల్ ఏరియా ప్రాంత గిరిజనులకు నూరు శాతం ఉపాధ్యాయ ఉద్యోగాలు స్థానిక నిరుద్యోగుల చేత భర్తీ చేయాల్సిందేనని వారు స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశంలో ఎటువంటి స్పష్టత రాకపోతే ఈ నెల 9న భవిష్యత్ కార్యాచరణ రూపొందించిన ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరించారు. అలాగే మండలంలో ఉన్న నిరుద్యోగ యువత యువకులందరు ఏకమై ఉద్యమాలు చేపట్టేందుకు సంసిద్ధంగా ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ప్రత్యేక డిఎస్సి సాధన కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస పడాల్, పి.సత్తి, పి.ప్రవీణ్ కుమార్, పి.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

వైసీపీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరిప్రసాద్ డిమాండ్

విశాలాంధ్ర - జికె వీధి : కూటమి ప్రభుత్వం ఎన్నికలకి ముందు హామీ ఇచ్చి ఎన్నికల హామీ నెరవేర్చకుండా ప్రతి పక్షాలు మీద నిందలు మోపడం తగదని జికే వీధి వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా కంకిపాటి గిరిప్రసాద్ మాట్లాడుతూ జీఓ నెంబర్ 3 కోసం రోడ్లు మీదకు అనేక ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు అన్నీ వర్గాలు కలిసి హక్కుల కోసం పోరాటం చేస్తుంటే ఉద్యమం ని అవహేళన చేస్తూ కూటమి నాయకులు మాట్లాడడం సరైంది పద్ధతి కాదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం లో ఉన్నప్పుడు ఆదివాసీ గిరిజన ప్రజానీకానికి ఎన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం లు చేసామన్నారు. ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చిన చరిత్ర మా వైస్సార్సీపీ పార్టీది, మీరు అధికారం లో రావడం కోసం ముందు ఒక మాట, అధికారం చేపట్టిన తరువాత మరో మాట మాట్లాడం మీ కూటమి ప్రభుత్వానికే చెల్లిందని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారం లో ఉన్నప్పుడు జీఓ నెంబర్ 3 కొట్టివేయా బడింది ఆరోజు జీఓ నెంబర్ 3 రద్దాయి నప్పుడు వైసీపీ ప్రభుత్వం ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ (గిరిజన సలహా మండలి) సమావేశం ఏర్పాటు చేసి, కేబినెట్ లో చర్చించి దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీం కోర్ట్ లో రివ్యూ పిటిషన్ వేయడం జరిగిందిని కానీ సుప్రీం కోర్ట్ డిస్మిస్ చేసిందన్నారు.ఈ విషయం కూటమి నాయకులు గ్రహించి మాట్లాడి తే బాగుంటుందన్నారు. ఈ చేతకాని కూటమి ప్రభుత్వం ఎన్నికలకి ముందు అరుకు బహిరంగ ఎన్నికల సభలో జీ ఓ నెంబర్ 3 మీద హామీ ఇవ్వడం జరిగిందన్నారు. దాని అమలు చేసి గిరిజన ప్రజానీకానికి మరియు ఆదివాసీ గిరిజన నిరుద్యోగ యువతి యువకులు దగ్గర మన్ననలు పొందాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలు కోసం పోరాడే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీల మీద అనవసరమైన ఆరోపణలు, బురదజల్లే ఎత్తు గడలు మానుకోవాలని కూటమి ప్రభుత్వం నాయకులు కి హితావు పలికారు. ఈ కార్యక్రమం లో వైసీపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి రీమల బాలకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు కల్చరల్ వింగ్ వంతల చంటిబాబు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పాతూని లక్ష్మణ్, మువ్వల చిన్నబ్బాయి, జోభ స్వామి నాదం, వంతల రాజా రావు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి వర్ధంతి సందర్భంగా వ్యాస రచన, వ్యక్తృత్వ పోటీలు

విశాలాంధ్ర - కురుపాం : యస్ సొసైటీ ఆధ్వర్యంలో దుద్దుఖల్లు పంచాయితీ కొత్తవలస లో నిర్వహించారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 7/5/1924 న అమరులయ్యారు. వంద సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా స్వతంత్ర సమరయోధుడు , గిరిజన బడుగు జీవుల కోసం ఉద్యమించిన గొప్ప వీరుడు ఎందరో గిరిజన యువతని స్వతంత్ర సమరం వైపు నడిపిన వ్యక్తి, అలాంటి మహనీయుని వందో వర్ధంతి సందర్భంగా ఆయన పోరాటాలు, ఆయన త్యాగాన్ని స్మరించుకోవడం ఎంతో అవసరం. ఈ సందర్భంగా ఆయననీ స్మరిస్తూ వ్యాస రచన, వక్తృత్వ (డిబేట్), డ్రాయింగ్ పోటీలు నిర్వహించటం జరిగింది వారికి యస్ సొసైటీ ఆధ్వర్యంలో బహుమతులు ఇవ్వటం జరిగింది. విప్లవ వీరుడు గురించి గిరిజన యువత కి అవగాహన రావాలి అనేది దీని ముఖ్య ఉద్దేశ్యం అని యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ చెప్పారు. అల్లూరి సీతారామరాజు మరణించినా ఆయన ఆశయాలు గిరిజన యువత ముందుకు తీసుకు వెళ్లాలని కోరారు ఈ కార్యక్రమంలో కొత్తవలస యువత మరియు మాజీ సర్పంచ్ కద్రక .కమలమ్మ స్థానిక ఉపాధ్యాయులు చిన్న రావ్ పాల్గొన్నారు.

వీఆర్ పురంలో ఆర్ అండ్ ఆర్ గ్రామసభ

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు పోలవరం ముంపుకు గురి అవుతున్న వి ఆర్ పురం మండల కేంద్రంలో మంగళవారం అర్ అండ్ ఆర్ గ్రామ సభ నిర్వహించడం జరిగినది. ఈ గ్రామ సభలో అర్హుల అనర్హుల జాబితాను ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్వాసితుల సమక్షంలో చదివి వినిపించడం జరిగింది. ఈ గ్రామ సభలో ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో మొత్తం 1704 పిడిఎఫ్ లు గుర్తించిగా వాటిలో 1481 పిడిఎఫ్ లు అర్హులుగా మరియు 223 అనర్హులుగా గుర్తించడం జరిగినది అని చెప్పినారు. తదుపరి ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్, పిఐపి ధవళేశ్వరం వారు మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ నిర్వాసితులకు ఇచ్చే ప్రక్రియను వివరించారు. అనర్హులు ఎవరు ఆందోళన చెందవద్దు అని చెప్పినారు.అదే విధంగా గ్రామ సభ జరిగిన నాటి నుండి 15 రోజుల వరకు నిర్వాసితులు నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది అని చెప్పినారు. తదుపరి ఇదే గ్రామసభలో అనర్హుల నుండి మరియు అర్హుల అనర్హుల జాబితాలో పేర్లు లేని వారి నుండి ప్రాజెక్టు అధికారి ఐటిడిఏ చింతూరు వారు చివరి వరకు దరఖాస్తులు స్వీకరించడం జరిగినది. ఈ గ్రామ సభలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు వివరణ ఇవ్వటం జరుగుతుంది అని చెప్పినారు.ఈ గ్రామసభల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, తహశీల్దార్లు, ఎంపీడీవో లు, రెవెన్యూ మరియు పంచాయతీ రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కిషోర్ బాలికలకు రుతుస్రావంపై అవగాహన

విశాలాంధ్ర - పార్వతీపురం రూరల్ : కౌమార దశ, కిషోర్ బాలికల శరీరంలో వచ్చే మార్పులతో పాటు నెలవారి వచ్చే ఋతుస్రావంపై బాలికలకు అవగాహన ఉండాలని అప్పుడే వారి ఆరోగ్యం సక్రమంగా ఉంటుందని డోకిశీల క్లస్టర్ సూపర్వైజర్ బంగారమ్మ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాజెక్టు పరిధిలో గల కౌమారదశ బాలికలకు కిషోర్ బాలికల సాధికారిక మనందరి బాధ్యత కార్యక్రమంపై మంగళవారం అవగాహన కల్పించారు. కిషోర్ బాలికలతో పాటు తల్లిదండ్రులను ఆయా అంగన్వాడి కేంద్రాలకు పిలిపించి కిషోర్ వికాసం వేసవి సెలవుల్లో అవగాహన విషయంపై చర్చించారు. శరీర పెరుగుదలతో పాటు బాలికల ఎదుగుదలకు ఎంతో కీలకమని ఇటువంటి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఆరోగ్య విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

ఎంఎల్ హెచ్‌పిలు మాటలు వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - బెలగాం : ఎంఎల్ హెచ్ పిలు/సిహెచ్ఓలు గత వారం రోజులుగా హక్కుల కోసం చేస్తున్న నిరసనలో భాగంగా ఎఎన్ఎంలపై, హెల్త్ సూపర్వైజర్లపై చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ యాక్షన్ కమిటీ అభిప్రాయ పడింది. మంగళవారం సాయంత్రం స్థానిక ఎపిఎన్జీఓ హెూం లో మెడికల్ %డ% హెల్త్ జెఎసి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎపిఎన్జీఓ జిల్లా అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్ ముఖ్య అతిదిగా హాజరయ్యారు. సమావేశంలో ఎంఎల్ హెచ్ పిలు/సిహెచ్ఓలు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని వెంటనే క్షమాపణలు చెప్పాలని, జీఓ నెం.143 ని రద్దు చేయాలని, వెంటనే బదిలీలు చేపట్టాలని, పెండింగ్ ప్రొమోషన్స్ ఇవ్వాలని, యాప్ లు తగ్గించాలని, ఫీల్డ్ స్టాఫ్ కి ఎఫ్ఆర్ఎస్ మిన హాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.చిన్నమ్మి, బి.పుష్ప, ఎన్.లలిత కుమారి, జయలక్ష్మి, భవాని, కె.రాణి, జ్యోతిలక్ష్మి, దుర్గా ప్రసాద్, జయగౌడ్, పార్వతి, రవణమ్మ, జిల్లా వ్యాప్తంగా మెడికల్ హెల్త్ ఉద్యోగులు 350 మంది పాల్గొన్నారు.

శరవేగంగా వైఎన్ పాకల - నల్లగొండ తారు రోడ్డు నిర్మాణం

విశాలాంధ్ర - కొయ్యూరు : మండలంలోని వై ఎన్ పాకల- నల్లగొండ మధ్య శిథిలమైన తారురోడ్డు నిర్మాణం చర వేగంగా చేపడుతున్నారు.ఈ మేరకు వారం రోజులుగా రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించే పనులను జరుపుతున్నారు. గత దశాబ్దకాలంగా శిథిలమైపోయి ఉన్న ఈ తారురోడ్డు అడుగు లోతు గోతులదేరి నడిచి వెళ్లేందుకు వీల్లేని పరిస్థితి లో ఉండేది.దీంతో గత ఎన్నికల ముందు గ్రామస్తులకు టీడీపీ పాడేరు ఇంచార్జీ గిడ్డి ఈశ్వరి రోడ్డు పూర్తికి హామీ ఇచ్చారు.దీంతో ఈ రోడ్డు ను పక్కా బి టి రోడ్డుగా ఉపాధి హామీ పథకం లో 98 లక్షల నిధులతో వై ఎన్ పాకాల నుంచి నల్లగొండ వరకు సుమారు 4 కిలోమీటర్ల వరకు తారు రోడ్డు ను చర వేగంగా నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే గ్రావెల్, మెటల్ పర్చు వేసే పనులు పూర్తి కాగా పక్కా బి టి రోడ్డు గా నిర్మించే పనులను మండల ఇంజినీరింగ్ అధికారి రామ కృష్ణ పర్యవేక్షణలో పనులను చేపడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తి అయితే మంగళపాలెం, కొప్పుకొండ, కొత్తవీధి, ఎస్ ఎం పాలెం, లొద్ది, నల్లగొండ తదితర గ్రామాలతో పాటు కొండపై ఉన్న గ్రామాలకు రహదారి సౌకర్యం ఇబ్బంది పూర్తిగా తొలగనున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బైక్‌లు చోరీ చేసిన వ్యక్తి అరెస్ట్

విశాలాంధ్ర - సోంపేట : మంగళవారం ఉదయం 8 గంటల సమయంలో బిరుసువాడ కాలనీ నెక్స్ట్ లెవల్ ద బైక్ గ్యారేజీ వద్ద సోంపేట ఎస్సై వి.లోవరాజుకు అందిన సమాచారం మేరకు ఒరిస్సా రాష్ట్రం బరంపురంనకు చెందిన అమిత్‌కుమార్‌పాత్రో (21)ను అదుపులో తీసుకోని విచారించగా సోంపేటలో బిఎస్ఆర్ షాప్ వెనుక హీరో హెూండా గ్లామర్ బైక్, సోంపేట మార్కెట్ వద్ద గల సచివాలయంలో మరో హీరోహెూండా గ్లామర్ బైక్ మోటార్ సైకిళ్ళు దొంగతనం చేసినట్లు నేరం అంగీకారించాడు. ఇంకా అతన్ని ఏమైనా దొంగతనాలు చేసావా అని అడగ్గా కంచిలి మండలంలో ఒక పల్సర్ బైక్, ఇచ్చాపురం టౌన్‌లో ఒక పల్సర్ బైక్, ఒక గ్లామర్ బైక్‌ను అదేవిధంగా ఒడిశాలో మరో రెండు గ్లామర్ బైక్స్ దొంగిలించినట్లు అతను తెలిపినాడు. అతని వద్ద నుంచి మొత్తం ఏడు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినారు. మోటార్ సైకిళ్ళు దొంగతనంనకు పాల్పడిన అమిత్ కుమార్ పాత్రోను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు. మోటార్ సైకిల్ దొంగతనం చేసిన ముద్దాయిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సోంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజు అభినందించినారు.

ఘనంగా ముగిసిన మత్స్యమాడుగులమ్మ ఉత్సవాలు

భారీగా తరలి వచ్చిన భక్త జనం

విశాలాంధ్ర - జి.మాడుగుల : గంగరాజు మాడుగులలో వెలిసిన మత్స్య మాడుగులమ్మ ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిసింది. మూడు రోజులుగా నిర్వహించిన ఉత్సవాలు శివర రోజు అనుమపోత్సవంతో ముగిసింది. శతకం పట్టు నుంచి అమ్మవారి ఘటాలను ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారి శిరస్సుపై మోసుకు వెళ్లి అమ్మవారి కొలువైన కొండలో ఘటాలను సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. స్థానిక రామాలయం వీధి నుంచి భారీగా ఊరేగింపు అందరిని అలరించింది. వివిధ వేషధారణతో కళాకారులు నృత్యాలు ఎంతగానో ఆకట్టుకుంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ప్రధాన రహదారి కిక్కిరిసింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ జాగ్రత్తాలు తీసుకుంది. ఈ ఉత్సవాల వాలీబాల్ పోటీల్లో మొదటి స్థానం గెలుచుక్ను సొలభం పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు జట్టును రూ.20వేలు నగదు బహుమతులు అందజేశారు. అలాగే మూడు రోజుల పాటు జరిగిన జాతరలో ఎక్కడ ఎటువంటి అవంఛానీయ ఘటనలు చోటుచేసుకోకుండా స్థానిక పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు మత్స్యరాస బాలరాజు, మత్స్యరాజు, అధ్యక్షుడు మత్స్యరాస రామారాజు, కార్యదర్శి గసాడి రెడ్డిబాబు, ఉపాధ్యక్షుడు మత్స్యరాస వెంకటగంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో దుర్మరణం...మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలోని వనిజ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు తమ్ముడు నిమ్మక విజయానంద్ (48) బైక్ పై వెళ్తూ యాక్సిడెంట్ కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. అయితే మృతుడు విజయానంద్ స్వస్థలం వనజ గ్రామం కాగా గత కొంతకాలంగా పార్వతీపురంలో నివాసం ఉంటూ అక్కడ నుండి ఉద్యోగరీత్యా వీరఘట్టం మండలం తూడి రెవెన్యూ గ్రామంలో విఆర్ఓగా పనిచేస్తున్నారు. ఆదివారం వనజ గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి అక్కడే ఉండి సోమవారం ఉదయం బయలుదేరి తన పల్సర్ బైక్ పై వస్తుండగా సుమారు 6.45 నిమిషాల సమయంలో తురకనాయుడు వలస - ఇటిక గ్రామాల మధ్య ఆర్ అండ్ బి రహదారిపై తురక నాయుడు వలస గ్రామానికి చెందిన గొర్లి సురేష్ ఎప్పటిలాగే తెల్లవారి వ్యాయామం నిమిత్తం నడుచుకుంటూవెళుతూ తిరిగి వస్తుండగా వెనుక నుండి విజయానంద్ వచ్చి సురేష్ ను ఢీకొనడంతో బండి అదుపుతప్పి పల్సర్ బైక్ హ్యాండ్ లో విజయానంద్ తల ఇరుక్కుపోయి ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. జరిగిన సంఘటన సురేష్ తన తమ్ముడికి ఫోన్ చేసి తెలియజేయడంతో తురక నాయుడు వలస నుండి గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని జియ్యమ్మ వలస పోలీసులకు సమాచారాన్ని అందించారు. అనంతరం ఎస్ఐ తన సిబ్బందితో వచ్చి జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం గొర్లి సురేష్ ను 108 సహాయంతో చికిత్సకు ఏరియా ఆసుపత్రికి తరలించి విజయానంద్ మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జియ్యమ్మవలస ఎస్ఐ ఎన్. ప్రశాంత్ కుమార్ తెలిపారు. మృతునికి నిమ్మక భారతి, నిమ్మక సునీత ఇద్దరు భార్యలు, మానస, కీర్తన, గీతిక ముగ్గురు కుమార్తెలు, పోషిత అనే కుమారుడు ఉన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

విశాలాంధ్ర - దుంబ్రిగుడ : మండలంలో గల కొల్లాపుట్టు పంచాయితీ పరిధి 7 అంగన్వాడి కేంద్రాలలో ఉన్న కిశోర బాలికలను మంగళవారం చంపగూడ గ్రామంలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళ శిశు సంక్షేమ శాఖ వారి ద్వారా వివిధ శాఖల సమన్వయంతో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ పి. రామ్మూర్తి, సెక్రటరీ గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 11 నుండి 18 సంవత్సరాల లోపు బాలికల కోసం రూపొందించిన ఒక పథకం ఈ పథకం ద్వారా విద్యా ఆరోగ్యం పోషకాహారం, సంరక్షణ, బాల్య వివాహం నిర్మూలన వంటి కార్యక్రమం చేపడుతుందన్నారు. అదేవిధంగా సూపర్వైజర్ నాగమణి మాట్లాడుతూ రుతు చక్రం పరిశుభ్రత, పోక్స్ చట్టం, ఆత్మరక్షణ, వృత్తి విద్య, జీవనోపాధి అవకాశాలు మొదలగు అంశాలపై కిశోర వికాసం పథకం ఒక్క లక్ష్యం లను వివరించి అవగాహన కల్పించారు. అనంతరం మహిళ పోలీస్ ఇంద్ర వేణి మాట్లాడుతూ బాలికలకు లింగ వివక్షత, గుడ్ టచ్, బెడ్ టచ్, లైంగిక వేధింపుల నుండి రక్షణ, మానవ అక్రమ రవాణా ఆత్మరక్షణ, నైపుణ్యం గురించి అవగాహన కల్పించారు. అన్ని అంగన్వాడి కేంద్రాలలో దసాల వారిగా నిర్వహించడం జరుగుతుందని సూపర్వైజర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, నేచర్ సంస్థ సభ్యులు కావ్య, సింహాచలం, 7 అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు, పెసా కమిటీ సభ్యుడు జగన్రాయి, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

అసభ్యకరంగా మాట్లాడిన వారు క్షమాపణలు చెప్పాలి

విశాలాంధ్ర - ఎటపాక : గత వారం రోజులుగా వారి డిమాండ్లు సాధించుకోడానికి నిరసన చేస్తున్న ఎన్‌హెచ్ఎం సిబ్బంది ఐన ఎంఎల్‌హెచ్ పిపిసిహెచ్ఓలు వారి కష్ట నష్టాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి డిమాండ్లు సాధించు కోవలసింది పోయి మొత్తం వైద్య ఆరోగ్య శాఖ విధానాన్ని, వైద్యులను, పారా మెడికల్ సిబ్బందిని, సూపర్వైజర్లని, ఎఎన్ ఎంలను అవమానిస్తూ, కించపరుస్తూ మాట్లాడడం, సోషల్ మీడియాలో పోస్టు పెట్టడాన్ని తీవ్రంగా కండిస్తూ... వెంటనే సంబంధిత వ్యక్తులు, అసోసియేషన్ బాద్యులు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ మంగళవారం నెల్లిపాక పి హెచ్ సి సిబ్బంది నిరసన ప్రదర్శనకు చేశారు.ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, ఎపి మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ గుజ్జా సీతమ్మ మాట్లాడుతూ... గుర్తింపు గౌరవం అనేవి ఉన్నత చదువులు చదివినంత మాత్రాన ఇచ్చేవి కాదని, అంకితభావంతో ఇన్నాళ్లు సమాజానికి చేసిన సేవలు తో ఈ స్థాయికి చేరుకున్నామని, ఈ చిన్న లాజిక్ తెలుసుకోడానికి ఉన్నత చదువులు అవసరం లేదని ఉన్నత చదువులు చదివామనే అహంకారంతో మాట్లాడితే సహించేది లేదని హెచ్చరిస్తూ తక్షణమే అసోసియేషన్ బాద్యులు, సంబంధిత వ్యక్తులు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. గౌతమి, డా. నాగమణి, పి హెచ్ ఎన్ అరుంధతి, ఫార్మాసిస్ట్, ఎల్‌టిలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఘన సత్కారం

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం : ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వ విప్ కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి సన్మానం చేసి, అభినందించారు. మంగళ వారం నాడు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గుమ్మలక్ష్మీపురం మండల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కురుపాం ఎమ్మెల్యే మరియు మండల విద్యాశాఖ వారు సన్మానించారు. పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రదర్శన అందించినందుకు ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించి పది మందికి ఆదర్శంగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని మరింత ఉన్నత చదువులు అభ్యసించాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు. విద్యార్థులను అభినందించి వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ యన్ టీ నాయుడు, డిప్యూటీ జ్ఞాన ప్రకాష్, సురేష్, విద్యా కమిటీ చైర్మన్ సొంటెనా రాజేష్, -1 చంద్రశేఖర్, -2 భీముడు, ఎంపిడిఓ సాల్మన్ రాజ్, ఎమ్మార్వో శేఖర్, విశ్రాంతి ఉపాధ్యాయులు హరి ప్రసాద్, జగన్నాథ్ రాథో, తదితరులు, మండలంలోని 13 పాఠశాలల ప్రిన్సిపాల్స్, హెడ్మాస్టర్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.